క్లుప్తంగా

'మానవత' ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న మానవత సంస్థ సభ్యులు

నల్లజర్ల: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మూడు బాధిత కుటుంబాలకు మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ ఆదివారం రూ.12 వేల ఆర్థిక సాయం చేసింది. నల్లజర్లలో అనారోగ్యంతో బాధపడుతున్న బైపే చినరవికి రూ.3 వేలు, ఆచంట రత్నానికి రూ.5 వేలు, ప్రకాశరావుపాలెంలో షేక్ బషీర్‌కు రూ.4 వేల ఆర్థిక సాయంగా అందజేశారు. కార్యక్రమంలో ఆ సంస్థ మండల శాఖ అధ్యక్షులు గుళ్లపూడి వెంకటరత్నం, సభ్యులు గుత్తికొండ వరప్రసాద్, ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, గుండు త్రినాథరావు, ఐడీవీ అప్పారావు పాల్గొన్నారు. అలాగే మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ నెలవారీ సమీక్ష సమావేశం ఆదివారం లిబర్టీ కాంప్లెక్స్‌లో జరిగింది. వివిధ అంశాలపై సమావేశంలో సభ్యులు చర్చించారు. జిల్లా నియంత్రణ కమిటీ చైర్మన్ కండెపు వెంకట సూర్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

నల్లజర్లలో 108 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న నిపుణుడు

నల్లజర్ల: సత్యసాయి సేవాసంస్థల ఆధ్వర్యంలో ఆదివారం నల్లజర్లలోని డాక్టర్ నల్లూరి వెంకటపతి ఆస్పత్రి ఆవరణలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి వైద్యశాల బృందం 108 మందికి పరీక్షలు నిర్వహించింది. వారిలో 36 మందికి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు. మరో 33 మందిని కళ్లజోళ్లకు సిఫార్సు చేశారు. వారికి కొఠారు అన్నపూర్ణమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారుడు మెహర్‌చంద్, కుమార్తె గోపి మణిశ్రీ ఆర్థిక సాయంతో కళ్లజోళ్లు అందించారు. కార్యక్రమంలో కన్వీనర్ ఘంటా శివరామారావు,డాక్టరు వెంకటపతి, సభ్యులు పాల్గొన్నారు.

వాడపల్లిలో వైద్య శిబిరం

కొవ్వూరు: వాడపల్లి గ్రామంలో జేకే స్టడీ సెంటర్, మణిపాల్ యూనివర్సిటీ ఆధ్వర్యం లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వాడపల్లి సర్పంచ్ గెల్లా ప్రసాద్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. రాజమహేంద్రవరానికి చెందిన ఆర్ఎస్ న్యూరో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు రోగులకు సేవలు అందించారు.శిబిరం నిర్వాహకుడు గెల్లా కేశవ, ఎడ్యుకేషనల్ కౌన్సిలర్ ఎం.సాయి చేతుల మీదుగా రోగులకు మందులు అందజేశారు. ఆర్ఎస్ న్యూరో ఆసుపత్రి మేనేజర్ తాతపూడి వంశీ, గెల్లా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


అగ్నిప్రమాద బాధితులకు సహాయం



బాధితులకు సాయం చేస్తున్న దాతలు

గోపాలపురం: మండలంలోని వాదాలకుంటలో శనివారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. పొగాకు బంటా పనుల కోసం ఇతర ప్రాంతం నుంచి వచ్చిన 10 కుటుంబాల వారు తలదాచుకుంటున్న పాకలు దగ్ధమయ్యాయి. దీంతో ఆదివారం వాదాలకుంట గ్రామానికి చెందిన ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, సర్పంచ్ జొన్నకూటి మనెమ్మ, గెడ అమ్మన్నబాబు, ఆచంట రామకృష్ణలు బాధిత కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులు, మంచాలు, దుస్తులు అందజేశారు.

ఉమా చోడేశ్వరునికి విశేష పూజలు



ఉమా చోడేశ్వరునికి అభిషేకాలు చేస్తున్న పండితులు

కొవ్వూరు: పట్టణంలోని పాతూరు ఉమా చోడేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అమ్మవార్లకు శ్రీ సూక్త విధానంలో కుంకుమ పూజ, స్వామి వారికి బిల్వార్చన చేశారు.స్వామి వారికి రుద్ర హోమం, బిల్వార్చన నిర్వహించారు.ఆలయ ప్రధానార్చకుడు కొతవరపు భాను, బాలప్ప ప్రసాద్, బాలప్ప రుక్మంగధరరావు, వాజపేయిల సూర్యనారాయణ, చావాలి దుర్గాప్రసాద్, చట్టి వెంకట రమణారావు తదితరులు పాల్గొన్నారు.

మార్చి రాకుండానే గ్రీష్మతాపం

- నగటు కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు పెరిగిన ఉష్ణోగ్రతలు
- పెరుగుతున్న విద్యుత్తు వినియోగం
- కూలర్లు, ఏసీలకు డిమాండ్



ఎండ తీవ్రతకు వెలవెలబోతున్న కొవ్వూరు మెయిన్ రోడ్డు

కొవ్వూరు: ఇంకా మార్చి నెల ప్రవేశించనే లేదు. అయినప్పటికీ ఎండలు మండి పోతున్నాయి. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు, మూడు డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. దీనికి ఉక్కపోత తోడయ్యింది. దాంతో ప్రజలు ఏసీలు, కూలర్లను ఆశ్రయిస్తున్నారు. పగలు, రాత్రి ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసం ఎక్కువగా ఉంటోంది. దాంతో భిన్న వాతావరణాన్ని తట్టుకోలేని జనం జలుబు, దగ్గు, జ్వరం వంటి వ్యాధులతో బాధ పడుతున్నారు. ప్రధానంగా వృద్ధులు, పిల్లల్లో ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతున్నాయి. కొవ్వూరు డివిజన్‌లోని కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు, దేవరపల్లి, నల్లజర్ల వంటి ప్రాంతా ల్లో పగటిపూట సరాసరిన 35-36 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది.

పెరిగిన విద్యుత్తు వినియోగం

ఉష్ణోగ్రతలు పెరగడంతో విద్యుత్తు వినియోగం సైతం గణనీయంగా పెరిగింది. ఏసీలు, ఫ్యాన్‌లు, కూలర్లు, ఫ్రిజ్‌ల వాడకం ఎక్కువైంది. ఈ కారణంగా గత నెల రోజుల్లో మినియన్ యూనిట్లు (పది లక్షల యూనిట్లు) వినియోగం పెరిగినట్టు విద్యుత్తు శాఖ అధికారులు చెబుతున్నారు. రోజుకు గతంలో 3.6 మిలియన్ యూనిట్లు ఉండే సరాసరి విద్యుత్తు వినియోగం ఈనెల 12 నాటికి 4.2 మిలియన్ యూనిట్లకు, 19న 4.4కు, 22న 4.5కు, 24న 4.68 మిలియన్ యూనిట్లకు పెరిగింది.ఈ వారంలో విద్యుత్తు వినియోగం రోజుకు 5 మిలియన్ యూనిట్లకు చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ట్రాన్స్‌కో నుంచి విద్యుత్ సరఫరాలో కొన్ని లోపాలు ఉండడం, స్థానికంగా వినియోగం పెరిగిన నేపథ్యంలో మూడు రోజులుగా వ్యవసాయ సర్వీసులకు రోజులో గంట నుంచి గంటన్నర సేపు కోత విధిస్తున్నామని అధికారులు చెబుతున్నారు.ఈ సమస్య రెండు, మూడు రోజుల్లో పరిష్కారం అవుతుందని స్పష్టం చేశారు.

వడదెబ్బ లక్షణాలు... తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- చెమట పట్టకపోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం , వణుకు రావడం, తగిన నిద్ర పట్టకపోవడం, కలవరింతలు రావడం, ఫిట్స్, పాక్షికంగా అపస్మారక స్థితికి వెళ్లడాన్ని వడదెబ్బగా గుర్తించవచ్చు.
- నీరు,పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ వంటి ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి.
- రోజుకు కనీసం 15 గ్లాసుల నీళ్లు తాగాలి.



విక్రయానికి సిద్ధంగా ఉంచిన కూలర్లు

- ఆహారం తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు తీసుకోవాలి.
- ఎండ తీవ్రత అధికంగా ఉన్న సమయంలో నీడ పట్టునే ఉండాలి.
- ఎండలో బయటి వెళ్లాల్సి వస్తే కచ్చితంగా గొడుగు, తలకు టోపీ వంటివి వినియోగించాలి.
- మాంసాహారం తగ్గించి, తాజా కూరగాయలు ఆహారంగా తీసుకోవాలి.
- ఉష్ణోగ్రత అధికంగా ఉన్నప్పుడు బయట తిరిగితే వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉంటుంది.

ప్రథమ చికిత్స అవసరం



వడదెబ్బ తగిలిన వారిని నీడలో ఉంచాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చేంత వరకూ చల్లని నీటిలో ముంచిన గుడ్డతో శరీరాన్ని తుడవాలి. గాలి తగిలే ప్రదేశంలో ఉంచాలి. ఉప్పు కలిపిన మజ్జిగ లేదా చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజ్ ద్రావణం, ఓరల్ రీహైడ్రేషన్ ద్రావణం (ఓఆర్ఎస్) తాగించాలి. పిల్లలు, గర్భిణులు, వృద్ధులు వేసవిలో అప్రమత్తంగా ఉండాలి. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు తాగించకూడదు. ఆసుపత్రికి తరలించాలి. – ఎస్.ధర్మరాజు, వైద్యాధికారి, దొమ్మేరు పీహెచ్‌సీ

ఏసీలు, కూలర్ల విక్రయాలు పెరిగాయి

ఎండల తీవ్రత అధికం కావడంతో ఏసీలు, కూలర్‌లు, ఫ్యాన్‌ల విక్రయాలు పెరిగాయి. ఆర్థిక స్థోమత కలిగిన వారు ఏసీలను ఆశ్రయిస్తుంటే మధ్య తరగతి, సామాన్యులు కూలర్లు, ఫ్యాన్‌లు కొనుగోలు చేస్తున్నారు. పదిహేను రోజులతో పోలిస్తే విక్రయాలు పది నుంచి పది హేను శాతం పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం వివిధ రకాల కంపెనీలు ఈఎంఐ సదుపాయం కల్పిస్తుండడంతో ఏసీల కొనుగోళ్లు గతంలో కంటే పెరిగినట్టు వ్యాపారులు చెబుతున్నారు.

తాడిమళ్లలో 'ఈనాడు' ప్రతుల దహనం



తాడిమళ్లలో 'ఈనాడు' ప్రతులను దహనం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నిడదవోలు రూరల్: 'ఈనాడు' దిన పత్రికలో వచ్చే తప్పుడు కథనాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు మానుకొండ చంద్రబాబు అన్నారు. మండలంలోని తాడిమళ్ల గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం 'ఈనాడు' పత్రిక ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో జరుగుతున్న సామాజిక న్యాయం చూడలేక ఎల్లో మీడియా అడ్డగోలు రాతలతో ప్రభుత్వంపై విషం చిమ్ముతోందన్నారు. టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభిపై దాడి చేయకపోయినా 'ఈనాడు'లో రామోజీరావు పాత ఫొటోలతో తప్పుడు కథనాలు రాయడం దుర్మార్గమన్నారు. తప్పుడు కథనాలు రాస్తే విలువ తగ్గిపోతుందని, వాస్తవాలు రాస్తే స్వాగతిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల నాగేశ్వరరావు, కోరుమామిడి సొసైటీ అధ్యక్షుడు వింతా గంగాధర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కాపకాయల సూర్యనారాయణ, తిరుమళ్ల దుర్గారావు, కోటిపల్లి సత్యనారాయణ, కానుబోయిన శేషు, రాపాక వెంకట్రావు, యాదల వరప్రసాద్, అడ్డగర్ల సుబ్బారావు పాల్గొన్నారు.

డేంజర్ స్పాట్‌ను పరిశీలించిన ఎంపీ, ఎమ్మెల్యే



బందపురం వద్ద పోలవరం కుడి కాలువపై సర్వీసు రోడ్డుపై వంతెన ఆవశ్యకతను ఎంపీ భరత్‌రామ్‌కు వివరిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

దేవరపల్లి: మండలంలోని బందపురం వద్ద పోలవరం కుడి కాలువపై ప్రధాన వంతెన నిర్మించినప్పటికీ సర్వీసు రోడ్డులో వంతెన నిర్మించక పోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్‌కు వివరించారు. పోలవరం కుడి కాలువ వద్ద ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాన్ని ఆదివారం ఎంపీ భరత్‌రామ్, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ కాలువకు ఇరువైపులా సర్వీసు రోడ్లు ఏర్పాటు చేసినప్పటికీ, వంతెన మాత్రం నిర్మించలేదన్నారు. ఇతర ప్రాంతాల వాహనదారులు సర్వీస్ రోడ్డుకు అనుసంధానంగా కాలువపై రోడ్డు ఉందని భావించి కాలువలో పడి ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఇటీవల బియ్యం లోడుతో వెళుతున్న లారీ కాలువలో బోల్తా పడి డ్రైవర్ మృతి చెందినట్టు ఆయన ఎంపీకి వివరించారు. రోడ్డుకు అనుసంధానంగా కాలువపై వంతెన నిర్మించాలని ఎంపీ భరత్‌రామ్‌ను ఎమ్మెల్యే వెంకట్రావు కోరారు. నేషనల్ హైవేస్ అథారిటీస్ అధికారులతో మాట్లాడి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని ఎంపీ భరత్‌రామ్ తెలిపారు.

ఆదర్శనీయుడు, మధుర గాయకుడు డాక్టర్ మూర్తి

- ఎంపీ మార్గాని భరత్‌రామ్
- అనంతపల్లిలో డాక్టర్ ఆరేపల్లి విగ్రహం ఆవిష్కరణ
- 500 మందికి వైద్య సేవలు



డాక్టర్ ఏఎస్ మూర్తి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ భరత్‌రామ్, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నల్లజర్ల: అనంతపల్లి పరిసర గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందించిన డాక్టర్ ఆరేపల్లి నరసింహమూర్తి ఆదర్శనీయుడని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా అనంతపల్లి దేవాలయాల సముదాయంలో ఘంటసాల విగ్రహం వద్ద అభిమానులు ఏర్పాటు చేసిన ఘంటసాల గాయకుడు డాక్టర్ ఆరేపల్లి నరసింహమూర్తి విగ్రహాన్ని ఆదివారం గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావుతో కలసి ఎంపీ భరత్‌రామ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తెలుగు ప్రజల హృదయాల్లో ఘంటసాల స్థానం సుస్థిరం అన్నారు. ఘంటసాలనే దైవంగా భావించి ఆయనను అనుకరిస్తూ పాటలు పాడిన డాక్టరు మూర్తి తనకు సమీప బంధువు కూడా అన్నారు. వివిధ ప్రాంతాల్లో మూర్తి రెండు వేలకు పైగా కచేరీలు ఇవ్వడం విశేషమన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మూర్తి కుమార్తె డాక్టర్ సుమ, లెక్చరర్ రాజేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎంపీ ప్రారంభించారు. రాజమహేంద్రవరం కేపీ హాస్పిటల్స్ డాక్టర్ ఆర్‌వీఎస్ కృష్ణప్రసాద్‌తో పాటు 30 మంది బృందం 500 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ నాయకుడు మార్గాని నాగేశ్వరరావు, అనంతపల్లి సర్పంచ్ వెంగల కమలకుమారి, ఉప సర్పంచ్ కలం సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, బంక అప్పారావు, మద్దిపాటి ప్రసాద్, వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రమణీయం.. రవితేజుని కల్యాణం



ప్రక్కిలంకలో సూర్యనారాయణమూర్తి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

- ప్రక్కిలంకలో ముగిసిన 14వ సౌర యాగం
- వేద మంత్రాలతో సూర్య భగవానుడికి నీరాజనం

తాళ్లపూడి: దేవతల కల్యాణాన్ని జరిపించడం లేదా వీక్షించడం వల్ల సకల శుభాలూ కలుగుతాయని వేద పండితుడు కొతవరపు విశ్వనాథశర్మ అన్నారు. లోక కల్యాణార్థం మాఘ మాసంలో మండలంలోని ప్రక్కిలంక గ్రామంలో నిర్వహించిన 14వ సౌర యాగం ముగిసింది. ఈ సందర్భంగా ఆదివారం సూర్యనారాయణమూర్తి శాంతి కల్యాణ్యాన్ని వైభవంగా నిర్వహించారు. వేద పండితులైన కొతవరపు విశ్వనాథశర్మ, సాయి కృష్ణశర్మ, ధనుంజయ్, సతీష్ శర్మ అభిరామశర్మ, దత్తాత్రేయశర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి ఉష, ఛాయ సమేత సూర్యనారాయణమూర్తి శాంతి కల్యాణాన్ని ఉదయం నుంచీ వేద మంత్రాల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉనపురి కృష్ణచైతన్య, దేవరకొండ వెంకట ప్రభాకర్ దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం నిర్వహించారు. మాఘ మాసం నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముగింపు సందర్భంగా పూర్ణాహుతి, రథోత్సవం, హోమం, గోపూజ మొదలైనవి నిర్వహించారు. సూర్యనారాయణమూర్తిని పుష్పాలు, నూతన వస్త్రాలతో విశేషంగా అలంకరించారు. ప్రక్కిలంక, తాళ్లపూడి, పైడిమెట్ట గ్రామస్తులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు తరలి వచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించి, తీర్థప్రసాదలు స్వీకరించారు. శశి శేఖర మిత్రబృందం ఏర్పాట్లను పర్యవేక్షించింది. అనంతరం సుమారు నాలుగు వేల మంది భక్తులకు అన్నదానం చేశారు.

ఆచంట శ్రీనివాస్‌కు ఎమ్మెల్యే తలారి పరామర్శ

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ మండలంలోని కురుకూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆచంట శ్రీనివాస్‌ను, ఆయన కుటుంబ సభ్యులను గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆదివారం పరామర్శించారు. శ్రీనివాస్ తాతయ్య కొయ్యలమూడి కృష్ణారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ క్రమంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మేడిబోయిన గంగరాజు, ఎంపీటీసీ సభ్యుడు కరుటూరి నిత్యానందం , పార్టీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్, నియోజకవర్గ మహిళా కన్వీనర్ గారపాటి రమాప్రభ, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ కుసులూరి వెంకటసతీష్ తదితరులు శ్రీనివాస్‌ను పరామర్శించారు.

సిమెంట్ రోడ్లకు భూమిపూజ

గోపాలపురం: మండలంలోని కరిచర్లగూడెం పంచాయతీ పరిధిలో నిర్మించే సిమెంట్ రోడ్లకు సర్పంచ్ పఠాన్ అన్సర్ బాషా ఆదివారం భూమిపూజ చేశారు. రూ.20 లక్షల వ్యయంతో ఈ సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపడుతున్నారు. కాగా వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా గ్రామంలోని పుంత రోడ్ల నిర్మాణాలకు నిధులు కేటాయించాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావును కోరినట్టు ఈ సందర్భంగా సర్పంచ్ బాషా తెలిపారు.

పొగ మంచు.. మది పులకించె



తాళ్లపూడి ఏటిగట్టు మార్గంపై కమ్ముకున్న పొగ మంచు

సూర్యోదయం అయినప్పటికీ పల్లెలను కప్పుకున్న మంచుతెరలు వీడడం లేదు. శివరాత్రి వెళ్లిపోయి వారం రోజులైంది. రోజురోజుకూ పగటి పూట సూర్యుడి తీక్షణత పెరుగుతోంది. మధ్యాహ్నం అయితే చాలు జనం ఇళ్ల నుంచి బయటకు రావడానికి సంకోచిస్తున్నారు. అయినప్పటికీ నిశిరాత్రి వేళ చలి, మంచు ప్రభావం ఏమాత్రం తగ్గడం లేదు. అంతేకాదు ఉదయం ఎనిమిది గంటలకు కూడా పల్లెలను మంచు తెరలు వీడడం లేదు. అందుకు నిదర్శనం తాళ్లపూడి, వేగేశ్వరపురం గ్రామాల్లో ఆదివారం దర్శన మిచ్చిన చిత్రాలివి. – తాళ్లపూడి



వేగేశ్వరపురంలో ఇలా..

ఎమ్మెల్యే చెరుకువాడ సౌజన్యంతో భారీ అన్నదానం



అన్న సమారాధనలో భక్తులకు వడ్డిస్తున్న ఆచంట ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు

నిడదవోలు రూరల్: మహా శివరాత్రిని పురస్కరించుకుని మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆర్థిక సహాయంతో మండలంలోని కాటకోటేశ్వరంలో కొలువైన ఉమా కాటకూటేశ్వర లింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఆదివారం భారీ ఎత్తు అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన శ్రీరంగనాథరాజు తొలుత స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన భక్తులకు స్వయంగా వడ్డించి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కోసూరి భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యుడు పెనుగుర్తి రాము, వైఎస్సార్ సీపీ నాయకులు ఆత్కూరి దొరయ్య, కోసూరి అప్పారావు, గుంటుపల్లి రామచంద్రరావు, కారింకి సత్యనారాయణ, గుంటుపల్లి కృష్ణమూర్తి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమిశ్రగూడెంలో..

శివరాత్రి ఉత్సవాలు ముగిసిన సందర్భంగా సమిశ్రగూడెంలోని పర్వత వర్ధిని ఉమారామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద ఆదివారం భారీఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బ్రాహ్మణగూడెంలో..

చాగల్లు: శివరాత్రి ఉత్సవాలు ముగిసిన సందర్భంగా మండలంలోని బ్రాహ్మణగూడెం బాల రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం భారీఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. సుమారు 10 వేల మంది భక్తులు ఈ అన్న సమారాధనకు హాజరయ్యారు. దారవరం, ఎస్.ముప్పవరం, గరప్పాడు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి, సొసైటీ అధ్యక్షుడు ఆత్కూరి దొరయ్య, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ధనలక్ష్మి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో వేలివెన్ను ధనలక్ష్మి అమ్మవారు

ఉండ్రాజవరం: మండలంలోని వేలివెన్ను గ్రామంలో కొలువైన ధనలక్ష్మి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించారు. భక్తులు కుంకుమ పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయం వద్ద భారీఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో వేలివెన్నుతో పాటు కాల్దారి, తాళ్లపాలెం, నందమూరు, శెట్టిపేట తదితర గ్రామాల నుంచి భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మోటార్ సైకిల్ చోరీపై కేసు

కొవ్వూరు: కాకినాడ జిల్లా కోరంగి గ్రామానికి చెందిన పోతురాజు ఆనందకుమార్ అనే వ్యక్తి మోటార్ సైకిల్ కొవ్వూరులో చోరీకి గురైంది. శనివారం ఉదయం ఎనిమిది గంటలకు కొవ్వూరులోని లక్ష్మి కేఫ్ వద్ద ఆయన తన వాహనాన్ని పార్కింగ్ చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు ఆ మోటార్ సైకిల్‌ను అపహరించుకు పోయారు. దీనిపై బాధితుడు ఆదివారం చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఎస్సై బి.దుర్గాప్రసాద్ తెలిపారు.

సూర్యారావుపాలెంలో 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి'

ఉండ్రాజవరం: తెలుగుదేశం పార్టీ నిడదవోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని సూర్యారావుపాలెం గ్రామంలో 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మండల, గ్రామ స్థాయి నాయకులు పాల్గొన్నారు.